

ఆయనతో స్నేహం చేసినవారు ఆయనను మరచిపోలేరు.

ఆయన హృదయమున్న మనిషి; 'మనీషి'

### ముక్కుకు సూటిగా మాట్లాడే మహామనీషి

# మన ఎలవర్తి రోశయ్యగారు


**సాహిత్యబ్రహ్మ డాక్టర్ వి.వి.యల్. నరసింహారావు**

రిటైర్డ్ డైరెక్టర్, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ


అనంతమైన సృష్టిలో అసంఖ్యాక జీవకోటి. అందులో మానవజన్మ ఉత్తమమైందిగా భావిస్తాం. మానవుల్లో కూడా ఉత్తమ మానవులు కొందరే, తక్కినవారంతా ఉత్తమానవులే.

ఉత్తమ మానవుల్లో కూడా మనీషులని చెప్పతగ్గవారు కొందరే. ఆ మనీషుల్లో కూడా మహామనీషులు వ్రేళ్లపై లెక్కించ దగ్గవారే. అటువంటి కొద్దిమందిలో ప్రథమ గణ్యుడుగా కనిపించే వ్యక్తి కీ.శే. శ్రీ ఎలవర్తి రోశయ్యగారు. కారణం... ఆయన మనసున్న మనీషి.

ఆయనగారు కన్నుమూసినా మర్చిపోవటానికి అసాధ్యమైన మంచిమనిషి. 'మనిషి' అని వ్రాయాలంటే భయంతో చేతులు వణకిపోతాయి. 'మనిషి' అనే పదాన్ని వ్రాసినా, ఉచ్చరించినా ఆయన ఊరుకుండేవారు కారు. ''మనిషేమిటి? మనుష్యుడు అని వ్రాయలేవా? మనుష్యుడు అని ఉచ్చరించలేవా?'' అని ముఖంమీద నిష్కర్షగా మాట్లాడేవారు. 'మనిషి' శబ్దం వ్యాకరణ సాధువు కాదనీ

'మనుష్యు'డనేదే వ్యాకరణ సాధువనీ మొగమాటము లేకుండా చెప్పేవారు.

నేను ఉండపట్టలేక ఒకోసారి ఎదురుతిరిగి ''అదికాదు, మాష్టారూ? వ్రాసేటప్పుడు 'మనుష్యుడు' అనే వ్రాస్తాం. బాగానే ఉంటుంది; మాట్లాడేటప్పుడుకూడా 'మనిషి' అని అనకూడదంటే ఎట్లాగండీ!'' అనేవాణ్ణి.

ఆయన ''అదిగో, అట్లా తడిగుడ్డల్తో గొంతులుకోసే ఆ స్వభావమే మంచిదికాదు. ఇదుగో, ఇది వ్యావహారికం, ఇది గ్రాంథికం అని స్పష్టంగా విభజనరేఖలు గీసుకొని మాట్లాడుకోవటం, వ్రాసుకోవటం మంచిదికదా!'' అని అనేవారు.

ఇంతకూ చెప్పవచ్చింది ఏమంటే ఎలవర్తి రోశయ్యగారు రణవైయాకరణి; వీరగ్రాంథికభాషావాది. సాక్షాత్తూ శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు వచ్చి వాదించినా ఒక అడుగు వెనక్కు వెయ్యకుండా తన గ్రాంథికవాదాన్ని తాను ప్రతిష్ఠించుకోవాలనే ప్రయత్నిస్తారు శ్రీ రోశయ్యగారు.

ఒక్క తెలుగులోనే కాదు, ఇంగ్లీషులో కూడా అంతే. అన్నట్లు ఆయనకు తెలుగులో చెప్పుకోదగ్గ విశ్వవిద్యాలయ యోగ్యతాపత్రాలు ఏవీలేవు. ఇంగ్లీషులో ఎం.ఏ. డిగ్రీ పుచ్చుకొని సుప్రసిద్ధమైన ఆంధ్ర క్రైస్తవ కళాశాల (గుంటూరు)లో ఆంగ్లోపన్యాసకుడుగా ఇరవయ్యో శతాబ్ది నాల్గవ దశకం నుండే పనిచేస్తుండేవారు. ఆ కళాశాలలో శ్రీ జార్జిథామస్ మొదలైన ఆంగ్లోపన్యాసకులూ, స్థానిక హిందూకళాశాలాధ్యక్షులుగా శ్రీ వల్లభజోస్యుల సుబ్బారావుగారు మొదలైన ఆంగ్ల పండితులూ శ్రీ రోశయ్యగారి ఆంగ్లభాషా పాండిత్యాదులను గురించి చెప్పుకొనేవారు.

క్లాసులో ఆయన పాఠం చెప్పేటప్పుడేకాదు; మామూలుగా ఇష్టాగోష్ఠిలో కూడా ఒక షేక్స్‌పియర్ ప్రస్తావన వచ్చినా, మిల్టన్ ప్రస్తావన వచ్చినా ఊరికే పైపై సంభాషణ చేసేవారుకాదు. అంతరాంతరాల్లోకి,

లోతుల్లోకి పోయి కావ్య హృదయాన్ని వివరిస్తూ దాని ఆత్మ ఆవిష్కరిస్తే కాని ఆయనకు తృప్తి ఉండేదికాదు. నాటక విషయంలో పాత్రల వాచికాభినయం మీద ఆయన ప్రత్యేకదృష్టి ఉండేది. తరగతుల్లో విద్యార్థులకు పాఠం చెప్పేటప్పుడు కూడా ఆంగిక సాత్వికాభినయాలను అదుపులో ఉంచుకుంటూ వాచికాభినయం మాత్రం నూటికి నూరుపాళ్ళూ అవగతమయ్యేట్లు చేసేవారు.

ఒక ఒథెల్లో, ఒక జూలియస్ సీజర్, ఒక బ్రూటస్... అందరూ రోశయ్యగారి వాచికాభినయంలో ఇట్టే ప్రత్యక్షమవుతూ ఉండేవారు.

ఉచ్చారణకూడా శబ్దవ్యుత్పత్తిని సాక్షాత్కరించేదిగా ఉండేది.

నిజానికి ఇంగ్లీషు స్పెల్లింగ్ ఉచ్చారణ ఒక సాధారణ నియమానికి లొంగేదికాదు. 'But' అని అన్న నోటితోనే put అనవలసి ఉంటుంది. That అన్న నోటితోనే Than అనాల్సి ఉంటుంది. అక్కడ 'u' ఉచ్చారణ, ఇక్కడ 'a' ఉచ్చారణ రెండు విధాలుగా ఎందుకున్నదో తెలుసుకోలేము. విశ్వనాథ సత్యనారాయణగారు 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు' నవల్లో లేవనెత్తిన ప్రశ్నలు జవాబు లేకుండానే మిగిలిపోతాయి. 'ఇది ఒక భాషయొక్క అనాగరిక స్థితి' అని అంటే ఆంగ్ల పండితులెవ్వరూ ఒప్పుకోరు సరికదా ముష్టియుద్ధానికి తలపడినా తలపడవచ్చు. మరి, మన రోశయ్యగారేమంటారోనని ఒకటి రెండుసార్లు నేను 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు' నవలను అయన దృష్టికి తీసుకువచ్చాను. విశ్వనాథ వారిది పాక్షికమైన దృష్టి అనీ, తొందరపాటుతో కూడిన నిర్ణయమనీ రోశయ్యగారు ప్రశాంతంగానే చెప్పారు. భాషలో శబ్దాలకు ఉచ్చారణ ఏర్పడటానికి భాషాచరిత్ర ఆనుపానులు కూడా పరామర్శించాలని అనేవారాయన.

మొత్తంమీద ఇంగ్లీషు మీద ఈగను కూడా వాలనిచ్చేవారుగాదు.

ఆయనది మొండివాదం కాదు; కార్యకారణ భావాలతో వాదనైపుణ్యంతో సత్యావిష్కరణ చెయ్యటమేనని పర్యవసానంగా తేలేది. కాకపోతే అడిగేవారికి ఓర్పు కావాలి; నేర్పుకావాలి.

రోశయ్యగారిది ఒకోసారి కొంచెం ప్రథమకోపం అనిపిస్తుంది. సత్య వచనంతోనే ఆయన్ను ప్రసన్నుణ్ణి చేసుకోవాలి.

నేనొకసారి ఆయన్ను ఒక ప్రశ్న వేశాను.

''ఏమండీ! తెలుగులోలాగే ఇంగ్లీషులో కూడా గ్రాంథిక వ్యావహారిక భేదాలున్నాయా? ఉంటే మనం వ్యావహారికమైన ఇంగ్లీషు మాట్లాడితే బాగుంటుందేమో?'' అని.

ఆయనన్నారు.

''పుట్టిన దగ్గరనుంచి మాట్లాడుతున్న తెలుగు వ్యావహారికాన్నే యథాతథంగా గ్రంథంలో వ్రాయమంటే పాతిక ప్రాంతీయ భేదాలతో ఒక పదం అనేకమైన అవతారాలతో ప్రత్యక్షమవుతున్నది. ఇక పరాయిభాష అయిన ఇంగ్లీషు భాషలోని ప్రాంతీయ భేదాలను అవగాహన చేసుకొని మాట్లాడాలంటే అది అయ్యేపనేనా? ఎందుకొచ్చిన ప్రయాస? సుఖంగా ఉన్న ప్రాణాన్ని బాధలపాలు చెయ్యకండి''

కనుక గ్రంథరచన ప్రస్తావనవస్తే విధిగా గ్రాంథికమే వ్రాయాలనేది ఆంధ్రాంగ్ల భాషలు రెండింటిలోనూ ఆయన నిష్కృష్ట నిర్ణయం.

ఆయన భావాలన్నీ ఛాందసములనీ, సంస్కారదృష్టి ఆయనకు లేదనీ అనుకోవటం పొరపాటు. భాషను కలగాపులగం చెయ్యవద్దని ఆయన అభిప్రాయం. భావాభివ్యక్తికి నిర్దుష్టమైన భాష ఎంతగానో సహకరిస్తుందని ఆయన భావం. ఈ ధర్మ సూక్ష్మం తెలిస్తేకాని ఆయన భాషా సిద్ధాంతం అవగతం కాదు.

రోశయ్యగారు సంస్కరణ ప్రియుడుగాడనటం సరికాదు. భాష విషయంలోనే కాదు; జీవితం విషయంలోనూ సంస్కారప్రియుడే. ఆమాటకొస్తే వితంతుపునర్వివాహాలు కూడా ఆయన ప్రోత్సహించేవారు. ప్రోత్సహించటమే కాదు. ఆచరణాత్మకంగా చేసుకొని మరీ చూపారు. 1940లో M.A. ఇంగ్లీషు పాసై ఆ సంవత్సరమే వివాహం

కూడా చేసుకొన్నారు. ఆ వివాహం సంస్కరణాత్మకమైన అటువంటి వివాహమే. ఆ దంపతులకు ఒక పుత్రిక, ఐదుగురు పుత్రులు. కుటుంబ విషయకంగా పరిపూర్ణమైన సుఖ సంతోషాలు పొందిన జీవి.

1930లో తెనాలి తాలూకా తురుమెళ్ల స్కూలులో కొన్నాళ్లు చదువుకున్నాడు. రేవేంద్రపాడు స్కూల్లో పనిచేయటమూ జరిగింది. భీమవరం కాలేజీలో కూడా కొన్నాళ్లు అధ్యాపకుడుగా పనిచేశారు. 1948 నుండి ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో పనిచేస్తూ గుంటూరు కమ్మ హాస్టలుకు వార్డెన్‌గా కూడా తన సేవలు అందించారు. గుంటూరులోని J.K.C. కళాశాలకు ప్రిన్సిపల్‌గా కూడా పని చేశారు. ఎక్కడ ఏ విధి నిర్వర్తించవలసి వచ్చినా దాన్ని చిత్తశుద్ధితో ముక్కుకు సూటిగా చూస్తూ చెయ్యటం ఆయన ప్రవృత్తి లక్షణం.

కలిసి మేమిద్దరం గుంటూరు ప్రధాన వీధుల్లో నడిచేటప్పుడు కాని కలిసి ఏదైనా ఒక కాఫీ హోటల్లో టిఫిన్ చేసేటప్పుడుకాని ఆయన పాటించే క్రమశిక్షణ జ్ఞాపకం వస్తే ఇప్పటికీ నాకు ముత్పులకలు కలుగుతాయి.

వీధిలో 'ఫుట్‌పాత్' మీద మేము నడిచివెళుతుంటే ''ట్రాఫిక్‌రూల్స్''కు విరుద్ధంగా నడిచివెళ్లే వారిని చూచి ఆయన కేవలం మాటల్తో విమర్శించటం మాత్రమే కాదు. దాదాపు ఒక ''ట్రాఫిక్ పోలీసు'' చేసినంతపని చేసి దారి సుగమం చేసేవారు. తెలిసినవాళ్లు ఆయన వీధిలో ఎదురుపడితే వాళ్ల జాగ్రత్తలో వాళ్లు ఉండేవారు.

కాఫీ హోటల్లో పెసరదోసెలకు ఆర్డరిచ్చేవారు. మేం చెరొకటి ఆరగించాలి. ఆ దోసెమీద ఎన్ని ఉల్లిపాయముక్కలుండాలో ఎన్ని అల్లం ముక్కలుండాలో ఎన్ని పచ్చిమిరపకాయ ముక్కలుండాలో - దోసె ఏమాత్రం కాలాలో (డబుల్‌రోస్ట్, ట్రిబుల్‌రోస్ట్ ఆయనకు అసహ్యం) వివరంగా చెప్పి ఆర్డరిచ్చేవారు. తాను చెప్పినవాటికి ఏమాత్రం విరుద్ధంగా ఆ దోసెలు తయారైనా ఆ హోటల్లో అదొక పెద్ద దృశ్యం. హోటల్ యజమాని క్షమాపణ చెప్పినా లాభం లేకపోయేది.

వీధుల్లో, హోటళ్ళలో రోశయ్యగారితో వ్యవహారం ఇట్లా ఉండేది. మరి యింట్లో తయారైన పదార్థాల విషయం ఎట్లా ఉండేదో తెలుసుకోవాలని అస్మదాదులకు అప్పుడప్పుడనిపించేది. మనిషితత్వం తెలుసుకనుక కుటుంబ సభ్యులందరూ ఆయన మనస్సు నొవ్వకుండా పదిలంగా ఉండేవారు. వారింట్లో పలుమార్లు ఫలహారాలు, కాఫీలు సేవించిన ప్రాణంనాది. ఆ పదార్థాలు ఆయన హృదయమంత స్వచ్ఛంగా, ఆయన స్నేహమంత రుచ్యంగా ఉండేవి.

హాస్టల్లో విద్యార్థుల కోసం తయారయ్యే భోజనపదార్థాలన్నీ శుచిగా, రుచిగా ఉండేట్లు చూచే బాధ్యత 'వార్డెన్'గా ఆయన నిక్కచ్చిగా నిర్వహించేవారు. హాస్టలు విద్యార్థులకు ఎంత క్రమశిక్షణ ఉండేదో అంత స్వేచ్ఛకూడా ఉండేది.

ఆటలు, పాటలు, నాటకాలు మొదలైన వాటికెంత ప్రాధాన్యమిచ్చేవారో నిర్దిష్ట వేళల్లో అధ్యయనానికీ అంత ప్రాధాన్యమిచ్చేవారు. అందుకే ఆయన అదుపులో అందరూ ఆదర్శవిద్యార్థులై అభివృద్ధిలోకి వచ్చేవారు.

భాషావ్యాకరణ పండితులన్నా, సంప్రదాయ సిద్ధంగా రచనలు చేసే కవులన్నా ఆయనకు పరమగౌరవం. ఈ కారణంచేతనే మాన్యులు శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారన్నా, శ్రీ త్రిపురాన వేంకట సూర్యప్రసాదరావుగారన్నా ఆయనకు ఎనలేని గౌరవం. దువ్వూరివారి బాలవ్యాకరణ రమణీయ వ్యాఖ్య, త్రిపురాన వారి 'మొయిలు రాయబారం' కావ్యం ఆయనకెంతో అభిమాన పాత్ర రచనలైనాయి. మొగమోటమేమిలేని అచ్చమైన విమర్శకులు శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తిగారు, శ్రీ పి.హెచ్. గుప్తగారు రోశయ్యగారి మన్నన అందినవారే.

ఆధునిక గేయకవులు, అభ్యుదయకవులు, వచనకవులు కొంతవరకు ఆయనకు ఇష్టులే. కాని సరుకు తక్కువ ఉండి అభినయం,

అహంభావం అధికంగా ఉండేకవులంటే ఆయనకు గిట్టేదికాదు. ఒకోసారి కొందరు నవకవులు ఆయనకు తమరచనలు వినిపించాలని నేరుగా ఆయన ఇంటికేవచ్చేవారు. ఆయన ప్రామాణిక సాహిత్యవేత్త అని ప్రతీతి ఉండేది. ఆకారణంగా ఆయన సలహాసంప్రతింపులకోసం కూడా రచయితలు ఆయన దగ్గరకు వస్తూఉండేవారు.

ఒకరోజు ఒక నవకవి తాను వ్రాసిన గేయాన్ని వినిపించేందుకు వచ్చాడు. వచ్చిన ఆయనకూ, ఆసందర్భంగా అక్కడే ఉన్ననాకూ, రోశయ్యగారికీ కమ్మని కాఫీ వచ్చేసింది. ముగ్గురం లొట్టలేసుకుంటూ సేవించాం కాఫీ.

'ఇహకానివ్వండి' అన్నారు రోశయ్యగారు నవకవితో,కవిగారు మొదలుపెట్టారు. మొదలుపెట్టబోయేముందు ఇది బయటి ప్రపంచం గూర్చి వ్రాసిన గేయమండి...ఇందులో నేనూ....'' అంటూ ఒక లఘుపీఠిక అందించే ప్రయత్నం మొదలుపెట్టారు.

రోశయ్యగారు ''కవిగారూ, రచన వినిపించండి. పీఠికాంశాలు కూడా దానితో మాకు అవగాహనకు వస్తాయి.'' అన్నారు.

కవిగారు ''నిజమేననుకోండి'' అంటూ మొదలుపెట్టారు.

''దీపం....కిటికీ

కిటికీ....దీపం

కిటికీ....దీపం

దీపం....కిట్కీ

కిట్కీ....దీపం''...ఈమకుటంతో చాలాసేపు సాడిగించాడు కవిగారు. రోశయ్యగారికి సహనం సన్నగిల్లజొచ్చింది. ఆచిన్నెలు ఆయన ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కవిగారు మకుటం సాభినయంగా వినిపించసాగారు.

రోశయ్యగారు ''కవిగారూ, విషయంలోకి రండి, మకుటం ఎంతసేపు సాడిగిస్తారు?

''అట్లా తీసెయ్యకండి సార్; అది చిన్నగది. దానికి కిటికీ ఉంది. గదిలోపలా, గది బయటా చిమ్మచీకటి; ఆచీకటిని చీలుస్తూ కిటికీలో దీపం. ఆదీపం గదిలోపలికి వెలుగు ప్రసాదించటమే కాకుండా గదివెలుపలి చీకటిని కూడా ఛేదిస్తూ గదిలోపలి జీవికి బాహ్య ప్రపంచజ్ఞానం కలిగిస్తున్నది.

'కిటికీ-దీపం'లో ఇంత అర్థం ఇమిడి ఉంది. గేయంలో నేను అదే చెప్పబోతున్నాను. తమరుకాస్త ఓర్పుగా చిత్తగిస్తే...''

రోశయ్యగారికి ఓర్పు సన్నగిల్లింది. అయినా కొంచెం నిదానించి ''బాగానే ఉంది. రెండుసార్లు ''కిటికీ కిటికీ'' అన్నారు. మూడోసారీ నాల్గోసారి 'కిట్కీ, కిట్కీ' అన్నారు. పదమధ్య అజ్లోపం ఒక్క ఉకారానికే అనుకుంటున్నాను. ఉకారేతరమైన అచ్చులకు కూడా వస్తుందా ఏమిటి?''అన్నారు.

కవిగారు బిత్తరపోయి ''కిటికీ''కి ఈవ్యాకరణానికి సంబంధమేమిటండీ;' అన్నారు.

రోశయ్యగారు ''కిటికీకి వ్యాకరణానికి సంబంధం ఉండకపోవచ్చుకాని. భాషకు కవిత్వానికీ సంబంధం ఉంటుంది బాబూ;. కనుక 'కిట్కీ' శబ్దసాధుత్వం ఆలోచించదగిందే'' అన్నారు.

కవిగారు బిత్తరపోయి, తెప్పరిల్లి ''అయ్యా; మరి 'కలికి'ని 'కల్కి' అంటున్నాం కదా 'కిటికీ'ని 'కిట్కీ' అంటే తప్పేమిటి?''అన్నారు.

రోశయ్యగారు నావంక చూచి ''తమరేమిటి? అట్లా నిశ్శబ్దంగా కూర్చున్నారు?''

నేను ''కవిగారు చెప్పిన సాదృశ్యం బాగానే ఉందనుకుంటున్నాను. నిఘంటువులు కూడా 'కల్కి' శబ్దాన్ని సాధువుగానే పేర్కొని ''కలికి'కి రూపాంతరంగా అంగీకరించాయిగదా!'' అన్నాను.

రోశయ్యగారు కొంత తృప్తితో చిరునవ్వునవ్వారు.

''సరే, తరువాత గేయపంక్తులు వినిపించండి'' అన్నారు.

కవిగారు వినిపించారు. రోశయ్యగారూ నేనూ కవిగార్ని అభినందించక తప్పలేదు. సరిగా అదే సమయానికి లోపలి నుంచి టిఫిన్ వచ్చేసింది.

కవిగారు ''ఇదంతా ఎందుకండీ?'' అన్నారు.

రోశయ్యగారు ''కవిని ఆకలితో పంపకూడదుకదండీ'' అన్నారు.

రోశయ్యగారింటి అతిథి మర్యాద పద్ధతి అట్లా ఉంటుంది.

ఇటువంటి సన్నివేశాలు వారింట్లో ఎన్నో;

గుంటూరు ఏ.సి. కాలేజిలో నాసాహిత్యోపన్యాసాలు, స్వీయనాటక ప్రదర్శన పద్ధతులు, కవితాగానాలు- అలనాటి విద్యార్థులు శ్రీ ఎన్. ఇన్నయ్య, శ్రీ ఇనాక్, శ్రీ వేగుంట మోహనప్రసాద్ మొదలైనవారి ప్రోత్సాహంతో శ్రీ రోశయ్యగారి అభినందనతో, శ్రీ జమ్ముల మడక మాధవరాయశర్మ, శ్రీ 'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రిగార్ల శుభాకాంక్షలతో కొనసాగేవి.

రోశయ్యగారు అటు ఆంగ్ల పండితులకూ, ఇటు తెలుగు పండితులకూ అభిమాన పాత్రుడుగా ఉండేవారు.

గొప్ప ఆత్మ సంస్కారంతో అందరికీ ఆప్తుడుగా మసలేవారు.
ఆయనతో స్నేహం చేసినవారు ఆయనను మరచిపోలేరు.
ఆయన హృదయమున్న మనీషి; 'మనిషి' (ఆయన కాదన్నా)
ఆత్మ పండిన మానవుడు.
ఆయనను మరచిపోవటం సాధ్యమా?
చిరస్మరణీయుడు శ్రీ ఎలవర్తి రోశయ్య

ఆర్జవము రూపుదాల్చు, స్నేహాస్పదుండు,
నయవిదుడు, సంఘ సంస్కరణ ప్రియుండు,
వ్యాకరణయుక్త భాషా విభాసురుండు,
మహితు డెలవర్తి రోశయ్య మాన్యుడుగద;